సమాచారం

1.87 లక్షల మందికి
రైతు భరోసా

- రూ.127.79 కోట్లు ఖాతాల్లో జమ
- జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

రంగారెడ్డి అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు భరోసా కింద ఈనెల 16, 17 తేదీల్లో కలిపి 1,87,255 మంది రైతులకు రూ.127.79 కోట్లు సాయం రైతుల ఖాతాల్లో జమ అయినట్లు జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. చిన్న సన్నకారు రైతులకు వారి అకౌంట్‌లో డబ్బులు జమ అయ్యాయని పేర్కొన్నారు. కొత్త పాస్‌పుస్తకాలు ఉన్న రైతులు వారి బ్యాంకు అకౌంట్ల వివరాలను స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయాధికారికి సమర్పించాలని సూచించారు. బ్యాంకు అకౌంట్ నంబర్ తప్పు ఉండి రైతు భరోసా సాయం అందని రైతులు వారి అకౌంట్ వివరాలను అందజేయాలని కోరారు.

దరఖాస్తు గడువు
నేటితో ఆఖరు

కొత్తూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాకు నూతనంగా దరఖాస్తు చేసుకునే రైతులు ఈనెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. జూన్ 5లోపు భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు అర్హులని పేర్కొన్నారు. రైతు భరోసా దరఖాస్తుతోపాటు, పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను జతచేసి వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో మరింత జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 2న తొలి విడత కింద రూ.లక్షలోపు యూనిట్లను మంజూరు చేస్తామని సర్కార్ ప్రకటించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. ఆఫ్‌లైన్‌లో విచారణ పూర్తి చేశారు. అర్హులను ఎంపిక చేశారు. కానీ.. అమలులో ఆలస్యమవుతోంది. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకానికి అంచనాలకు మించి దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో అర్హులకే రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తులను పునఃపరిశీలన చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

6

జూన్ 2న మంజూరు పత్రాలు ఇస్తామని వాయిదా
ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..
ఆఫ్‌లైన్‌లో విచారణ
అర్హుల ఎంపిక పూర్తి..
అమలులో జాప్యం
రూ.లక్ష లోపు ఎక్కువ యూనిట్లు ఇవ్వాలని ప్రభుత్వ యోచన



యువ వికాసం..
మరింత జాప్యం!
రుణాల కోసం నిరుద్యోగుల ఎదురుచూపు



రూ.లక్ష లోపు రుణాలకు వచ్చిన దరఖాస్తులు

	50 వేల వరకు	50,000 - లక్ష వరకు	మొత్తం
టార్గెట్	1,486	2,472	3,958
దరఖాస్తులు	1,147	1,360	2,507
లబ్ధిదారుల ఎంపిక	847	1,088	1,935

రంగారెడ్డి అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ పథకానికి సంబంధించి రుణ లక్ష్యం తక్కువగా ఉండటం, దరఖాస్తులు ఎక్కువగా ఉండటంతో ఇప్పట్లో ఈ పథకం పట్టాలపైకి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. రాయితీపై రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు అందించాలనే ఉద్దేశంతో యువత నుంచి నెల కిందట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు వేర్వేరుగా దరఖాస్తులు స్వీకరించాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 78,789 దరఖాస్తులు వచ్చాయి. రూ.50 వేల యూనిట్లకు సంబంధించి 1,147 మంది దరఖాస్తు చేసుకోగా 1,486 మందికి రుణం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 847 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. రూ.50 వేల నుంచి

మిగతా 8వ పేజీలో...

కార్పొరేషన్ల వారీగా..
రాజీవ్ యువ వికాసానికి వచ్చిన దరఖాస్తులు

ఎస్సీ	18,552
ఎస్టీ	6,913
బీసీ	36,607
మైనారిటీ	13,670
క్రిస్టియన్ మైనారిటీ	387
ఈబీసీ	2,660
మొత్తం	78,789



తాటిపర్తిలో తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించండి

యాచారం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ భూ సేకరణలో భాగంగా నిషేధిత జాబితాలో చేర్చిన తమ పట్టా భూములకు విముక్తి కల్పించాలని యాచారం మండలంలోని తాటిపర్తి, నానక్‌నగర్ గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను అడ్డుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేదాక సదస్సులు పొట్టొద్దని, తమ పట్టా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేసి ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వం తమ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిషేధిత జాబితాలో ఉంచడం దారుణమని తహసీల్దారు అయ్యప్ప, డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్ వద్ద వాపోయారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని తప్పడం సరైంది కాదన్నారు. రైతుల అనుమతి లేకుండా బలవంతంగా భూసేకరణ చేయొద్దని, రైతు భరోసా సాయమందేలా చూడాలని వేడుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మున్సిపాలిటీ ముఖచిత్రాన్ని మార్చుకుందాం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన కొత్తూర్ మున్సిపాలిటీ ముఖచిత్రాన్ని మార్చేందుకు పార్టీలకు అతీతంగా నాయకులు కలిసి రావాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద గల కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఏనుగు జనార్దన్‌రెడ్డి నివాసంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి పనుల కోసం నిధుల కొరత లేదని, వార్డుల్లో నిలిచిపోయిన సీసీ రోడ్లు, ఇతర పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. బీజేపీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ విషయమై విలేకరులు ప్రశ్నించగా.. ఫోన్ ట్యాపింగ్ చేసిన వారు జైలుకు పోక తప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యాదేవేందర్‌యాదవ్, వైస్‌చైర్మన్ డోలీ రవీందర్, కమిషనర్ బాలాజీ, కోస్గి శ్రీనివాస్, కౌన్సిలర్లు చంద్రకళారాజేందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ జె. వేణుగోపాల్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్, మండల శాఖల అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, నాయకులు వీరమోని దేవేందర్ ముదిరాజ్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో వాణిజ్య దుకాణాల సముదాయం, సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

మోడల్ మార్కెట్‌గా
తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం/మంచాల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డును రైతులకు మెరుగైన సేవలందించే విధంగా మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మార్కెట్ యార్డులో రూ.1.78 కోట్ల వ్యయంతో నిర్మించిన వాణిజ్య దుకాణాల సముదాయం, సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో నాలుగు కోట్లతో మార్కెట్ కార్యాలయ భవనం, రైతులు వేచి ఉండే భవనం, ధాన్యం నిల్వ చేసే గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా నిర్మించిన మడిగెలను త్వరలోనే ఆన్‌లైన్ టెండర్ల ద్వారా కేటాయిస్తామని చెప్పారు. ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు రూ.40 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. రూ.20 కోట్లతో ఇబ్రహీంపట్నం చెరువు కట్టను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇవ్వలేమని ఈ విషయంలో రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ టి.ప్రసాద్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి,

మిగతా 8వ పేజీలో...

క్రీడా పాఠశాలల్లో
చేరికకు ఆహ్వానం



షాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): క్రీడా పాఠశాలల్లో చేరికలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడా పాఠశాలలైన హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థులను ఎంపిక చేస్తున్నారని తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ నెల 18, 19 తేదీల వరకు మండల విద్యాధికారి ద్వారా కాని, ఆన్‌లైన్ ద్వారా కాని అప్లికేషన్ చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు 1 సెప్టెంబర్ 2016 నుంచి 30 ఆగస్టు 2017 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఈ నెల 19వ తేదీన మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి ఎంపిక ఉంటుందని తెలిపారు.



కల్లు కాదు.. కాలకూట విషం!



మత్తు పదార్థాలతో కల్తీ కల్లు తయారీ
విచ్చల విడిగా అమ్మకాలు.. పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



చౌదరిగూడ లాల్‌పహాడ్‌లో ఆటోలో తరలిస్తున్న కల్లు బాక్సులు

చౌదరిగూడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈత చెట్ల పెంపకం లేదు.. ఉన్న రెండు మూడు చెట్లకు కల్లే గీయకున్నా.. కల్లు డిపోలో మాత్రం పెట్టెలు పెట్టెలు కల్లు దర్శనమిస్తుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో విక్రయాల జోరు కొనసాగుతుంటే అధికారులు మాత్రం వారివైపు కన్నెత్తి చూడటం లేదు. కేవలం రసాయ పదార్థాలతో తయారు చేసే కల్లు దందా కొనసాగుతుంది. రసాయనాలతో తయారుచేసే కల్తీ కల్లు మనుషుల నాడి వ్యవస్థపై ప్రభావం చూపి తీవ్రమైన అనారోగ్యాల పాలు చేస్తుంది. కల్తీ కల్లు జోరు రోజు రోజుకు పెరిగిపోతున్నా ఎక్సైజ్ పోలీసులు మాత్రం కల్లు డిపోలు నెలసరి ఇచ్చే మాముళ్లపై పెట్టిన శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై పెట్టడం లేదన్న విమర్శలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి.

అంతకు మించితే అనర్థమే..

ఈత చెట్ల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతున్నా.. కల్లు తయారీపై వాటి ప్రభావం ఏమాత్రం పడటం లేదు. ఎందుకంటే స్వచ్ఛమైన కల్లు కాకుండా కల్తీ తయారు చేస్తున్నారు. ఇందుకోసం గతంలో

మిగతా 8వ పేజీలో...

పర్యవేక్షిస్తున్నాం..



కల్తికల్లు విక్రయాలు జరపకుండా పర్యవేక్షిస్తున్నాం కొందుర్గు మండలంలో చెర్కుపల్లి, పర్వతాపూర్, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో కాస్లాబాద్‌లో మాత్రమే ఈత చెట్లు ఉన్నాయి. కల్తీ కల్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామాలకు లైసెన్స్ ఉన్నాయి. లైసెన్స్‌ల సంఖ్య చెప్పడానికి టైం పడుతుంది. ఆఫీసుకు వచ్చి డిటెల్స్ తీసుకోండి అంటూ దాటవేశారు.

- సునిత, ఎక్సైజ్ ఎస్సై, షాద్‌నగర్



సేంద్రియ ఎరువు.. 6
దిగుబడి బాగు
పశువులు, జీవాల ఎరువులతో భూసారం పెంపు
అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

వారం రోజులుగా
నీటి కటకట
- పగిలిన భగీరథ పైప్‌లైన్
- నాలుగు మండలాల్లో తప్పని నీటి తిప్పలు 6

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కేశంపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకురుతుందని, తరుచూ చేతులు కడుక్కొని డయేరియాను నివారించాలని జిల్లా మాత శిశు ఆరోగ్యం కార్యక్రమాధికారి, డాక్టర్ పూనం అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో మంగళవారం స్టాఫ్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూనం మాట్లాడుతూ వర్ష కాలం సీజన్‌లో ప్రజలు డయేరియా బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో డయేరియాతో పాటు ఇతర జబ్బులను నివారించుకోవచ్చని వివరించారు. తల్లులకు, గర్భిణులకు ఇమ్యూనైజేషన్, ఆరోగ్య మహిళా కార్యక్రమం ఎలా నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు



మాట్లాడుతున్న జిల్లా మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాధికారి పూనం



రెవెన్యూ సదస్సులో రైతుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే యాదయ్య

సమస్యల పరిష్కారానికే భూ భారతి

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు తీర్చడానికే కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మహాలింగపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణి పేరుతో రైతులను పదేళ్ల పాటు నరకం అనుభవించారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తెచ్చారని వివరించారు. రైతులకు రుణమాఫీ చేయడంతోపాటుగా రైతు బరోసాతో ఎకరానికి రూ.12,000 ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు నిర్భయంగా తమ సమస్యలు అధికారులతో చెప్పుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, ఆర్‌ఐ సుప్రియ, సొసైటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు, గోపాల్‌రెడ్డి, లింగారెడ్డి, చంద్రయ్య, రఘునందన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మొక్క నాటి నీరు పోస్తున్న జ్యోత్స్న

ఆమనగల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న పిలుపునిచ్చారు. కమిషనర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పరిధిలో మంగళవారం మున్సిపల్ సిబ్బందికి వైద్య శిబిరం, మొక్కలు నాటడం, పారిశుధ్య నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్ నోటీసులు, ప్లాంటేషన్ స్థలాల పరిశీలన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ మంజులాదేవితో కలిసి మొక్కలు నాటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సురసముద్రం చెరువును పరిశీలించారు. ఎంపీహెచ్ ఈవో తిరుపతిరెడ్డి, టీపీవో వరప్రసాద్, ఏఈ శ్రీనివాస్, ఇన్‌చార్జి మేనేజర్ సత్యనారాయణ తదితరులున్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న శ్రీకాంత్

కడ్తాల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్స్ విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఎంఈవో సత్యనారాయణకు ఏబీవీపీ రాష్ట్రనాయకుడు క్యామ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కడ్తాలలో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అడ్మిషన్లు, ఫీజుల పేరుతో భారీగా డబ్బు దండుకుంటున్నారని పేర్కొన్నారు. 30 నుంచి 50 శాతం ఫీజును చెల్లిస్తేనే విద్యార్థులను అనుమతిస్తున్నారని, అర్హతలేని టీచర్లతో బోధన చేయిస్తున్నారని శ్రీకాంత్ పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కడ్తాల నగరకార్యదర్శి పవన్, సందీప్ ఉన్నారు.

సేంద్రియ ఎరువు.. దిగుబడి బాగు

- పశువులు, గొర్లు, మేకల ఎరువులు వాడితే భూ భౌతిక స్థితి మెరుగు
- అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు


నజ్దిక్‌సింగారంలోని ఓ పొలంలో గొర్ల మంద

యాచారం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పంటల దిగుబడి పెంచేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. కొన్ని రోజులుగా వివిధ గ్రామాల్లో వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు యాచారం, చౌదర్‌పల్లి, నందివనపర్తి, గున్‌గల్ గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. కోళ్ల ఎరువు, పశువుల పేడ, కంపోస్ట్, మేకల, గొర్ల ఎరువు తరచూ వేయాలని సూచించారు. రసాయన ఎరువులు అధికంగా వాడితే నేల సహజత్వాన్ని కోల్పోతుందని తెలిపారు.

గొర్లు, మేకల మందలతో మేలు

మేకల, గొర్ల మూత్రంలో 13శాతం నత్రజని, 20 గ్రాముల పొటాషియం, పాస్ఫరస్ ఉంటాయని శాస్త్రవేత్తలు చెప్పారు. ఒక్క ఏడాది జీవాల ఎరువు వాడితే మూడేళ్ల వరకు ఎరువులు వేయకున్నా పంట దిగుబడి బాగా ఉంటుందని చెప్పారు. పశువుల ఎరువుల్లో కాల్షియం 1-1.4శాతం, మెగ్నీషియం 3-7శాతం, సోడియం 2-1.1శాతం, పొటాషియం3.6శాతం, పాస్పరస్ 15శాతం, సల్ఫేట్ 3-5శాతం, యూరిక్ యాసిడ్ 135గ్రాములుంటాయని అధికారులు తెలిపారు.


జమ చేసిన గొర్ల ఎరువు

సేంద్రియ ఎరువులే ఎక్కువ వాడుతా



నేను దుక్కి దున్నిన తరువాత పశువుల ఎరువు చల్లి మరోసారి దుక్కి దున్ని విత్తనాలు వేసుకుంటా. వరి సాగులో పశువుల, గొర్లు మేకల ఎరువులు వాడితే దిగుబడి పెరుగుతుంది. దుక్కులు దున్నగానే మేకల, గొర్లమంద పెడితే నేలసారవంతమైంతుంది. నేల చౌడు తగ్గుతుందని రైతులకు సూచిస్తున్నా. సేంద్రియ ఎరువులు వాడితే రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది.

- కె.జోగిరెడ్డి, రైతు, నందివనపర్తి

సేంద్రియ సాగుతో తెగుళ్ల బెడద తగ్గుతుంది



పంటలకు పశువుల, మేకల గొర్ల ఎరువులు వాడితే తెగుళ్ల బెడద అంతగా ఉండదు. పంట దిగుబడి పెరుగుతుంది. సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తే పంట నాణ్యత పెరుగుతుంది. ఆర్థిక భారం తగ్గుతుంది. రసాయన ఎరువుల వాడకాన్ని సాధ్యమైంతన తగ్గించాలి. పశువుల ఎరువుకు తోడు మేకల గొర్ల మందలను పొలాల్లో పెట్టిస్తే నేలసారవంతంగా మారుతుంది.

- రవినాథ్, ఏవో, యాచారం

పాఠశాల స్థలంపై అధికారుల విచారణ

పెద్దేముల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి):తమ భూమిలో ప్రభుత్వ పాఠశాల నిర్మించారని, తమకు పరిహారమివ్వాలని నెల్లిగడ్డతండాకు చెందిన రమేష్ గత నెలలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం అధికారులు విచారణ జరిపారు. ఎంపీడీవో రతన్‌సింగ్, సీడీపీవో శ్రీలక్ష్మి మంగళవారం కొండాపూర్ పాఠశాలకువెళ్లి విచారణ జరిపారు. స్కూల్ 1999లో, అంగన్‌వాడీ భవనం 2010లో నిర్మించినట్లు గుర్తించారు. రమేష్ తల్లిదండ్రులు పాఠశాలకు భూదానం చేశారని తేలింది. రమేష్ సోదరుడే కాంట్రాక్ట్‌పై పాఠశాలను నిర్మించినట్లు తేల్చారు. రమేష్ తల్లిదండ్రుల మృతితో 2008లో ఆర్వోఆర్‌లో భూమి అతడి పేరిట నమోదైంది. దీంతో పాఠశాల భూమి తనది, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. గ్రామస్తులతో జరిపిన విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు


నియామక పత్రాన్ని అందజేస్తున్న వెంకటేష్‌గౌడ్

కందుకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని నేదునూరు, మాన్యగూడ, ఆకులమైలారం గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సౌడపు వెంకటేష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు యూత్ కాంగెస్ గ్రామ కమిటీలతో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ మేరకు నేదునూరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎం.మహేందర్, ఉపాధ్యక్షులు ఎ.సుధాకర్, జి.సాయికిరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొహైల్‌బేగ్, కుక్క మహేష్, సోషల్ మీడియా ప్రెసిడెంట్ బైకం లోకేష్‌యాదవ్, మన్యగూడ గ్రామ శాఖ అధ్యక్షుడిగా వరికుప్పల శివకుమార్, ఉపాధ్యక్షులు ఎగిరిశెట్టి గణేష్, వి.శివకృష్ణ, ప్రధాన కార్యదర్శులు వి.చింటు, బి.ప్రేమ్‌కుమార్, సోషల్ మీడియా ప్రెసిడెంట్‌గా వి.శ్రీనివాస్, ఆకులమైలారం అధ్యక్షుడిగా మేకం రమేష్, ఉపాధ్యక్షులు ఎల్.మహేందర్, జి.ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు ఆర్.శివకుమార్, సోషల్‌మీడియా ప్రెసిడెంట్‌గా జి.శివలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏఎంసీ డైరక్టర్లు సురేందర్, పుష్పాదర్శన్, శమంత ప్రభాకర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, జి.కళమ్మరాజు, ఎండీ అఫ్జల్ బేగ్, రాంరెడ్డి, సురేష్, గౌర శ్రీశైలం, గాదె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాం

యాలాల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ఎల్లప్పుడూ అండగా ఉండి ఆదుకుంటామని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అగ్గనూరుకు చెందిన ఉప్పరి వెంకటయ్య, ఉప్పరి కల్పన అనారోగ్యంతో ఆసుపత్రి పాలై ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. వీరికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.82వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు వెంకటయ్య కుటుంబానికి రూ.40వేలు, కల్పన కుటుంబానికి రూ.42వేల విలువగల చెక్కులను మహేందర్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం తమ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శాంతు, వెంకటయ్య, శివా తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

కేజీబీవీల్లో నాణ్యమైన భోజనం అందించాలి


పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ

కడ్తాల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెస్ చార్జిలకు అనుగుణంగా విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ కస్తూర్బా బాలికల పాఠశాల నిర్వాహకులకు సూచించారు. విద్యా సంస్థల బలోపేతం, పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. కడ్తాలలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం గీత సందర్శించారు. పాఠశాల రికార్డులను, పరిసరాలను, విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. పాఠ్యపుస్తకాలను విద్యార్థినులకు పంపిణీ చేశారు. బాలికలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినులతో కలిసి ఆమె భోజనం చేశారు. ఎస్వో అనిత, టీచర్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పురస్కారాల అందజేత

షాద్‌నగర్ రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందించారు. మండలంలోని బూర్గుల కేంద్రంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీ మంగళవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసి సమావేశంలో అందించారు. టెన్త్‌లో 450కిపైగా మార్కులు సాధించిన 450మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పుస్తకాలు అందజేశారు. అలాగే తమ సబ్జెక్టుల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యా బోధన చేసిన 70మంది ఉపాధ్యాయులకు మెమొంటోలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దీనాశంకర్, మురళీకృష్ణ, జగదీష్, కార్తీక్, శ్రీకాంత్, తులసి, శ్వేత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బ్యాగులు, ప్రశంశాపత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

చదువుకు పేదరికం అడ్డుకాదు


బాలికకు అడ్మిషన్ పత్రాన్ని అందజేస్తున్న ఉప్పల ట్రస్ట్ సభ్యులు శ్రీశైలం, గోపాల్‌నాయక్

తలకొండపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డుకాదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తిరుమణి శ్రీశైలంగౌడ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరు చేయూతనిచ్చి ప్రోత్సహించాలని కోరారు. సంగాయిపల్లి గ్రామానికి చెందిన రమాదేవి భర్త నరేశ్ అకాల మరణంతో కూతురు పల్లవిని చదివించేందుకు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్‌ను ఆశ్రయించారు. దీంతో స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పల్లవి చదువుకు తోడ్పాటునందించాడు. దీంతో ట్రస్ట్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, గోపాల్‌నాయక్ పల్లవికి పాఠశాల అడ్మిషన్‌ను అందజేశారు. ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పేద పిల్లలకు తోడ్పాటునందిస్తున్న వెంకటేశ్‌ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహ, నాయకులు తదితరులు ఉన్నారు.

వైఖరి మారకుంటే పీడీ యాక్ట్

- తాండూరు ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

తాండూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, సారా విక్రయిస్తూ పట్టుబడి బైండోవరైన 15మంది తిరిగి అక్రమ కార్యకలపాలు కొనసాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వైఖరి మారకుంటే వారిపై పీడీ యాక్ట్ పెడతామని తాండూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తహసీల్దార్ వద్ద బైండోవర్ అయిన 15మందిలో ఇప్పటి వరకు ఏడుగురు రూ.2.70లక్షల జరిమానా చెల్లించారని వెల్లడించారు. జరిమానా చెల్లించని 8మంది షోకాజ్ నోటీసులు తీసుకొని తప్పించుకుంటున్నారని తెలిపారు. చలానా, జరిమానా చెల్లించకుంటే ఏడాది పాటు జైలుశిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. తాండూరు పట్టణం మాణిక్‌నగర్, ఇంద్రానగర్, విలియంమూన్ మైదాన్, తట్టేపల్లిలో గంజాయి విక్రయిదారులు ఉన్నారని తెలిపారు. ఎన్ఫోర్స్‌మెంట్ టీం, ఎక్సైజ్ టీం సంయుక్తంగా దాడులు నిర్వహిస్తోందని సీఐ చెప్పారు.

వారం రోజులుగా నీటి కటకట

- పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్
- నాలుగు మండలాల్లో నీటి తిప్పలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

చేవెళ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల అలసత్వం, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో వారం రోజులుగా నాలుగు మండలాల్లో తాగునీటి కటకట నెలకొంది. ప్రజలు తాగునీటికి వ్యవసాయ బోర్లు, ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. అయితే వారం రోజుల క్రితం షాబాద్ మండలం అంతారంలో మెయిన్‌లైన్ పైప్ పగిలిపోయింది. అప్పటి నుంచి గ్రామాలకు నీరు రావడం లేదు. వ్యవసాయ పనుల ఊపందుకుంటున్న, పిల్లలు స్కూళ్లకు వెళ్తున్న ఈ సమయంలో నీరురాక కష్టతరంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. పాత బోర్లనుంచి నీరు సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా అవి పనిచేయడం లేదు. వ్యవసాయ బోర్లు, ట్యాంకర్ల వద్ద నీరు తెచ్చుకుంటున్నారు. పట్టణాల్లో ఒకటి రెండు కాలనీలకు ఒక్క ట్యాంకర్‌ను పంపుతున్నా సరిపోవడం లేదు. చాలా కాలనీలకు ట్యాంకర్లు పోవడం లేదు. పైప్‌లైన్ సరిచేసేందుకు ఎన్ని రోజులు తీసుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ బోర్లను రీస్టార్ట్ చేసుకోవాలని అధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరా జరగడం లేదని ప్రజలంటున్నారు. పొలం పనులు మానుకొని నీటి కోసం వెంపర్లాడుతున్నామని జనం వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు భగీరథ పైప్‌లైన్‌కు రిపేర్ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యపై చేవెళ్ల మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గీతాస్రవంతి స్పందిస్తూ.. పగిలిపోయిన పైప్‌లైన్‌కు రిపేర్ చేయిస్తామని చెప్పారు. మిషన్ భగీరథ నీరు రావడానికి ఇంకా రెండు రోజుల సమయం పడుతుందని తెలిపారు. అప్పటి వరకు పంచాయతీ బోర్ల నీటిని సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించామని వివరించారు.


చేవెళ్లలో ట్యాంకర్ నీరు పట్టుకుంటున్న ప్రజలు


కళాశాలలో సమావేశమైన అధ్యాపకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య

బొంరాస్‌పేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా చౌదర్‌పల్లి జెడ్పీ హెచ్‌ఎస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యాభివృద్ధి, సదుపాయాల కల్పన కోసం నిధులు మంజూరు చేస్తుందన్నారు. విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరేందర్, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్కు రైతులకు రూ.10.75 కోట్ల పరిహారం అందజేత


చెక్కును అందజేస్తున్న తహసీల్దార్ కిషన్‌నాయక్

తాండూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు(ఎంపీఐపీ) ఏర్పాటుకు భూములు అందజేసిన రైతులకు రూ.10.75కోట్ల విలువైన చెక్కులను మంగళవారం తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. దుద్యాల తహసీల్దార్ కిషన్ నాయక్ చేతుల మీదుగా హకీంపేట్ గ్రామానికి చెందిన 29 మంది రైతులకు 53.30ఎకరాల భూమికి సంబంధించిన పరిహారాన్ని అందజేశారు. ల్యాండ్ అక్విజేషన్ కింద ఈ పరిహారాన్ని అందజేసినట్లు తహసీల్దార్ వివరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ముందుకు వచ్చి భూములు అందించిన రైతులు తమకు వచ్చిన పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తడి, పొడి చెత్తపై అవగాహన

మేడ్చల్ టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపాలిటీ 12వ వార్డులో మంగళవారం తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణకు ఇంటి వద్దకు వచ్చే మునిసిపల్ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. ప్రజలు వీధులను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్‌చందర్, ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రియాంక పాల్గొన్నారు.


మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న ఎంపీ రాజేందర్

మురుగునీటి వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు

కీసర రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో మురుగునీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలో బీఎంఆర్, ఇతర కాలనీల్లో మున్సిపల్ మాజీ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డితో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. గొలుసుకట్టు నాలాలను పరిగణనలోకి తీసుకోకుండా వెంచర్లు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. దీంతో మురుగు, వరద నీరు పోయేందుకు కాలువల్లేక ఇళ్లల్లోకి వరద చేరుతోందన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రధాన రహదారి గుండా దాయరకుంట వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణానికి హెచ్‌ఎండీఏ నుంచి రూ.10కోట్లు మంజూరు చేయించినట్టు ఎంపీ వెల్లడించారు. త్వరలోనే పనులు చేపడుతామని వివరించారు. ఎంపీ వెంట మున్సిపల్ మాజీ ఛైర్మన్ మల్లేశ్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, స్థానికులు ఉన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

తాండూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మంగళవారం సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కాగ్నా నది నుంచి రాత్రింబవళ్లు ఇసుక తోడుకొని అమ్ముకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరం మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అంతారం లలిత, ఉపాధ్యక్షులు రాజు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.



తొలగిన మురుగు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం వినాయక్‌చౌక్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని పారదోలేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో 'రోడ్డుపైకి మురుగు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం శానిటేషన్ జవాను రమేష్, పారిశుధ్య సిబ్బంది మురుగు నీటిని తొలగించి శుభ్రంచేశారు. దీంతో ప్రజలకు, వ్యాపారులకు, పాదచారులకు తాత్కాలికంగా ఇబ్బందులు తొలగాయి.

రైతు సంక్షేమమే ధ్యేయం


సీఎం, స్పీకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రవీందర్, నాయకులు

» కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్

మర్పల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ అన్నారు. రైతుభరోసా నిధులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుండడంతో మంగళవారం బూచన్‌పల్లిలో రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రఘుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్, బల్వంతరెడ్డి, మామిడి రాములు, రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్, రంగయ్య పాల్గొన్నారు.

ఏకకాలంలో రైతు భరోసా జమ

యాలాల: రైతుభరోసా పథకం డబ్బులు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తిమ్మాయిపల్లి రాజు పేర్కొన్నారు. సోమవారం రాత్రి నుంచే డబ్బులు జమవుతున్నాయని తెలిపారు. మంగళవారం ఎకరానికి రూ.6వేల చొప్పున 3ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బు జమచేశారని చెప్పారు. మరో ఏడు రోజుల్లో అందరు రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని వారు పేర్కొన్నారు.

తీరనున్న సొంతింటి కల

● హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు ● జిల్లాలో 22 గ్రామాలకు 2,280 ఇళ్ల మంజూరు


బేస్మెంట్ లెవల్ పూర్తయిన నిర్మాణం

కొడంగల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరనుంది. మండలానికో గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేశారు. కోస్గి మండలం చంద్రవంచలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పథకాన్ని ప్రారంభించారు. రూ.5లక్షలతో ఇంటిని నిర్మిస్తారు. ఇంటిని 450 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపు పిల్లర్లతో కట్టుకోవాలనే నిబంధన పెట్టారు. జిల్లాలో మండలానికో గ్రామం చొప్పున 22గ్రామాలను ఎంపిక చేసి 2,280ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. నిర్మాణానికి రూ.5లక్షలు నాలుగు విడతల్లో బిల్లులు చెల్లిస్తారు. బేస్మెంట్ పూర్తిచేస్తే రూ.1లక్ష, రూఫ్ లెవల్ వరకు పిల్లర్లు, గోడలు కట్టుకుంటే రూ.1లక్ష, స్లాబ్‌వేస్తే రూ.2లక్షలు, మరుగుదొడ్డి, ఫ్లోరింగ్ తదితర చివరి పనులన్నీ పూర్తిచేస్తే చివరి లక్ష ఇస్తారు. జియో ట్యాగింగ్ చేసి పునాది నుంచి నాలుగు విడతల ఫొటోలను అప్‌లోడ్లతో బిల్లులు ఖాతాలో జమచేస్తున్నారు. కాగా నిబంధనల మేరకు నిర్మించుకుంటే గదులు చిన్నగా ఉంటున్నాయని చాలా మంది కట్టుకోవడం లేదని తెలుస్తోంది. విస్తీర్ణాన్ని 900అడుగుల నుంచి వెయ్యి అడుగులకు పెంచాలని కోరుతున్నారు.

నత్తనడకన నిర్మాణాలు

మోడల్ గ్రామాల్లో 200 నుంచి 300 వరకు ఇళ్లను మంజూరు చేశారు. మంజూరై 45రోజులైనా నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. 22 గ్రామాలకు 2,280ఇళ్లు మంజూరు కాగా 720 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 167 నిర్మాణాల బేస్మెంట్ పూర్తయ్యాయి. 17 రూఫ్ లెవల్‌కు, నాలుగు స్లాబ్ లెవల్‌కు వచ్చాయని అధికారులు తెలిపారు. ప్రొసీడింగ్‌లిచ్చిన నిర్మాణాలను 45 రోజుల్లో పూర్తి చేసుకోవాలని నిబంధనపెట్టినా ఆ మేరకు పనులు చేయడం లేదు. ఖాళీ స్థలాల్లేక, పాతిళ్లను కూల్చేందుకు ఆసక్తి చూపక, చిన్నగా కట్టుకోవాలనే నిబంధన వంటి అడ్డంకులొస్తున్నాయి. అప్పుచేసి పనులు మొదలుపెట్టినా బిల్లుల ఆలస్యమవుతున్నాయి. ఇష్టానుసారం కట్టేవారికి బిల్లులు రావడం లేదు.

కొడంగల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు

మండలం	గ్రామం	మంజూరు	ప్రారంభం	బేస్మెంట్ లెవల్
కొడంగల్	అన్నారం	206	52	16
బొంరాస్‌పేట్	నాగిరెడ్డిపల్లి	97	25	18
దౌల్తాబాద్	నందారం	27	18	4
దుద్యాల్	సంగాయిపల్లి	62	46	16
మొత్తం		392	141	54

కల నెరవేరనుంది

ఇంటి మంజూరుతో గూడులేని నాకు సొంతింటి కల నెరవేరడం సంతోషంగా ఉంది. రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తికి నిబంధనల మేరకు పనులు చేస్తున్నాం. ఇల్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- సంతోష, లబ్ధిదారు, అన్నారం

నిబంధనలు సడలిస్తే బాగుంటుంది

ఇంటి నిర్మాణాల్లో నిబంధనలు కఠినంగా ఉన్నాయి. సడలిస్తే బాగుంటుంది. లబ్ధిదారులు తమకు అనుకూలంగా నిర్మాణం పూర్తి చేసుకున్నా బిల్లులు ఇవ్వాలి. 400-600చదరపు అడుగుల నిబంధన ఇబ్బంది కల్గిస్తోంది. తక్కువ విస్తీర్ణంలో ఇల్లు కడితే ఇరుగ్గా ఉంటుంది. కనీసం వెయ్యి చదరపు లడుగుల స్థలంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అనుమతివ్వాలి.

- వెంకటమ్మ, లబ్ధిదారు, సంగాయిపల్లి

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలి. బేస్మెంట్ పూర్తయిన వారికి బిల్లులు మంజూరయ్యాయి. కొడంగల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల మేరకు కట్టుకుంటేనే బిల్లులు అందుతాయి.

- హేమ్‌చందర్‌నాయక్, హౌసింగ్ డీఈ


పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

పశువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

మేడ్చల్ టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పశువులకు టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి కురుమూర్తి అన్నారు. మంగళవారం రావల్‌కోల్‌లో గొర్రెలకు ఈటీ వ్యాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ... పశువులను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో పశువులకు వివిధ వ్యాధులు సోకే ఆస్కారం ఉంటుందన్నారు. కాబట్టి పశువులకు టీకాలు తప్పక వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు, రైతులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

శామీర్‌పేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారి కమలాకర్ ఆధ్వర్యంలో తూంకుంటలోని రాష్ట్రస్పోర్ట్స్ స్కూల్‌కు మంగళవారం శామీర్‌పేటలోని మినీ స్టేడియంలో మండల స్థాయి సెలక్షన్లు నిర్వహించారు. ఎంఈఓ, పీడీ, పీఈటీలు విద్యార్థులకు ఫిజికల్ పరీక్షలను నిర్వహించారు. 12మంది విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. తుది ఎంపిక జిల్లా స్థాయిలో జరుగుతుందని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సత్తిరెడ్డి, గోపాల్‌చారి, పీఈటీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు పర్మిట్.. అక్రమంగా డంప్

» జర్నలిస్టు కాలనీ పేరిట ఇసుక రవాణాకు అనుమతి

» కొత్త ఇళ్ల వద్ద డంపింగ్ » రెచ్చిపోతున్న ఇసుక మాఫియా


ఓ ఇంటి ముందు డంప్ చేస్తున్న ఇసుక

తాండూరు/తాండూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు కాలనీలో పనులే ప్రారంభం కాలేదు. మార్కింగ్ కూడ చేయలేదు. అక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి 30లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు మొదలు కాలేదు. ఇప్పుడే పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూట్ ఇంజినీర్ మాత్రం ఇసుక పర్మిట్లు జారీ చేస్తున్నారు. దీంతో ఇసుక మాఫియా తాండూరులో ఎక్కడ ఇల్లు కడితే అక్కడ ఇసుకను డంప్ చేస్తూ డబ్బులు దండుకుంటోంది. అంతారం పరిధిలో జర్నలిస్టు కాలనీ ఉంది. ఇసుకను కాగ్నా నది నుంచి తెచ్చి తాండూరులోని సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి, పాత తాండూరు, గౌతాపూర్ ప్రాంతాల్లోని ఇళ్లకు అమ్మేస్తున్నారు. మంగళవారం ఓ ట్రాక్టర్ ఇసుకను జర్నలిస్టు కాలనీలో సీసీ రోడ్డుకని సాయిపూర్‌లో డంప్ చేశారు. విలేకరులు ప్రశ్నిస్తే బెదరింపు ధోరణిలో ఇసుక మాఫియా ప్రవర్తిస్తోంది. ఈ విషయమై తహసీల్దార్ తారాసింగ్ స్పందిస్తూ.. పర్మిట్ ఇచ్చిన దానికే ఇసుక వాడాలని, పక్కదారి పట్టిస్తే పర్మిట్లు రద్దు చేయడంతో పాటు ఇప్పటి వరకు తరలించిన ఇసుకపై జరిమానా వసూలు చేస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే ఇసుక పర్మిట్లు తాము జారీ చేయం అని, రెవెన్యూ శాఖనే జారీ చేస్తుందని పంచాయతీ రాజ్ ఏఈ నందిని చెప్పడం గమనార్హం.

బీజేపీ పథకాలను వివరించాలి

మేడ్చల్ టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు తెలియజెప్పే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని మేడ్చల్ పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ అన్నారు. బీజేపీ పాలన 11ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా.. మంగళవారం మేడ్చల్‌లో నాయకులు పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. శైలజ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనేక మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతోందన్నారు. ఉచిత రేషన్, గ్రామీణ రోడ్ల ఆధునికీకరణ, ఆరోగ్య పథకాలు, జాతీయ రహదారులు తదితర కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కరపత్రం ఇస్తున్న బీజేపీ అధ్యక్షురాలు శైలజ


సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు మల్లారెడ్డి

సమాజ హితానికి సాహిత్యం దోహదం

వికారాబాద్, జూన్17(ఆంధ్రజ్యోతి): సాహిత్యం సమాజంలోని చెడును తొలగించి హితాన్ని పెంచుతుందని, విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని భువనగిరి ఎస్‌ఎల్‌ఎన్ డిగ్రీ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్ తూర్పు మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నవాబుపేట మండలం తిమ్మారెడ్డిపల్లిలో నంబియార్ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన పద్యపదభారతి నూతన సాహితీ సంస్థ ఏర్పాటు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పద్య పద భారతి సంస్థ ద్వారా విద్యార్థులకు పద్య కంఠస్థ పోటీలు, సాహిత్య సంబంధ కార్యశాలు, కవి సమ్మేళనాలు, పండుగలు, జాతరల్లో ధార్మిక ప్రసంగాలు చేయించి ప్రజల్లో చైతన్యం తేవాలని కోరారు. డాక్టర్ చంద్రప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అంతరించిపోతున్న జానపద కళలు, పౌరాణిక పద్య నాటకాలు, యక్షగానాలకు ప్రాణంపోయాలని, బాల కవులను భావి కవులుగా తీర్చిదిద్దాలని సూచించారు. పద్య పదభారతి అధ్యక్షుడిగా రాఘవేంద్రాచార్యులు, గౌరవాధ్యక్షులుగా బందెప్పగౌడ్, వెంకటదాసులు, ఉపాధ్యక్షులు విశ్వనాథం, శ్రీపాదశర్మ, కరణం మాణిక్‌రావు, నరసయ్య, కార్యదర్శి ఎం.రాజు, సహకార్యదర్శులు సుధాకర్‌గౌడ్, పరమేశ్వర్, వెంకట్, సాంస్కృతిక కార్యదర్శి మల్కానెల్లి లాల్‌రెడ్డి, కోశాధికారి రెడ్యానాథోడ్‌లను ఎన్నుకున్నారు.


బెల్కటూర్‌లో టీబీ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బెల్కటూర్‌లో టీబీ నిర్ధారణ పరీక్షలు

తాండూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి):జినుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బెల్కటూర్ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురుకి టీబీ, ఎన్జీవో ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రషీద్ మాట్లాడుతూ.. రక్త పోటు, హెచ్‌ఐవీ, ఓల్డ్ టీబీ, మధుమేహం వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలున్న వారికి కళ్లె పరీక్ష చేశారు. అవసరమైన వారికి ఎక్స్‌రే కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. వ్యాధి ఉన్న వారికి 6నెలల మందులు, రూ.వెయ్యి ఇస్తామని వైద్య లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్, సూపర్‌వైజర్ నీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, ఏఎన్‌ఎం పుష్ప, సంపూర్ణ ఎన్జీవో అవుట్ రీచ్ వర్కర్స్, జ్యోతి, ఇందు, కృష్ణవేణి, ఎన్జీవో, సూపర్‌వైజర్ హర్షవర్ధన్, ఆశా కార్యకర్తలు రాధమ్మ, భాగ్యమ్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

వికారాబాద్, జూన్17 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. 2026 యూపీఎస్సీ పరీక్షల కోసం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి తెలిపారు. ఎంపికైనా అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు జూలై 4 లోపు హెచ్‌టీటీపీ://స్టడీసర్కిల్.సీజీజీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదన్నారు. మరిన్ని వివరాలకు 6281766534 నంబర్‌లో సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి

» క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

ఆమనగల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం, క్లబ్ 40వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. కడ్తాల మండలం మైసిగండి ఎమ్మార్జీ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి క్లబ్ జిల్లా గవర్నర్ జి.మహేందర్ కుమార్‌రెడ్డి, మాజీ గవర్నర్లు జి.చెన్నకిషన్ రెడ్డి, జూలూరి రమేశ్‌బాబు, సందడి నరేందర్‌రెడ్డి, శ్యామ్‌కుమార్, మాజీ వైస్ గవర్నర్ సురేశ్ జగ్గా, రీజియన్ ఛైర్మన్ జనార్ధన్‌రెడ్డి, జోన్ ఛైర్మన్ లింగయ్య ముఖ్య అతిథులుగా వచ్చారు. ఆమనగల్లు క్లబ్ అధ్యక్షుడిగా కె.గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్వో ఎంఎ.పాషా, ఉపాధ్యక్షుడు ఎంగిళి బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి కొరివి వెంకటయ్య, టేమర్‌గా చేగూరి వెంకటేశ్, టెల్ ట్విస్టర్‌గా మోహన్‌రెడ్డి, లియోక్లబ్ అధ్యక్షుడిగా జె.శ్యామ్‌సుందర్, కార్యదర్శి శశీందర్, కోశాధికారి ధర్మేందర్‌లతో ఇన్‌స్టలేషన్ ఛైర్మన్ ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్, కో-ఛైర్మన్‌లు వెంకటేశ్, జహంగిర్ అలీ ప్రమాణం చేయించారు. క్లబ్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ప్రగతి నివేదికను మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ వెల్లడించారు. అనంతరం సమావేశంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ మహేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సేవలను ఏటేటా విస్తరిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలు, తండాల్లో వైద్య శిబిరాలు, ప్రజాచైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఆమనగల్లు క్లబ్ రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలవడం, యూఎన్‌ఓలో సభ్యత్వం పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు ఉప్పల వెంకటేశ్, అనురాధ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్‌ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, లయన్స్‌క్లబ్ సభ్యులు వీరబొమ్మ భిక్షపతి, దామోదర్‌రెడ్డి, రమేశ్, బి.రామచంద్రారెడ్డి, ఎం.అంజయ్య, చంద్రశేఖర్, సుధీర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణమూర్తి, కృష్ణ, కొండల్‌రెడ్డి, పాండురెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ఓంకారం, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లు : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ

రైతుల సంక్షేమానికి పెద్దపీట

ఆమనగల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతన ర్సింహ అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకనుగుణంగా రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతులకు రుణ విముక్తి చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళ వారం రైతు భరోసా పెట్టుబడి సాయం ఎకరాకు రూ.6 వేల చొప్పున వానాకాలం డబ్బులు విడుదల చేయడాన్ని హర్షిస్తూ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్ అధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. రాజీవ్ చౌక్‌వద్ద కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయ కులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా, మండల నాయకులు వస్పుల శ్రీశైలం, రవీందర్ నాయక్, వస్పుల మానయ్య, కృష్ణనాయక్, ఖాదర్, అలీం, బాబా, ఖాదర్‌ఖాద్రీ, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : రైతు భరోసా పెట్టుబడి సాయం విడుదల చేయడాన్ని హర్షిస్తూ కడ్తాల మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహల ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనా యక్, హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్‌లు ముఖ్య అతిధు లుగా హాజరై రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రామ కృష్ణ, శంకర్, సత్యం, మల్లేశ్, షాబోద్దీన్, మల్లయ్య, జగన్, జవహర్ లాల్, రాంచందర్, యాదయ్య, తదితరులున్నారు.

తలకొండపల్లి : కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మోహన్‌రెడ్డి, మిట్ట పల్లి అంజయ్య, అజీం, రవీందర్ యాదవ్, రాములు, చెన్నకేశవులు, శివకుమార్, బోల్ల యాదగిరి, రేణురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి : పాలాభిషేకం చేస్తున్న ప్రభాకర్ రెడ్డి, నాయకులు

'భూ భారతి'తో సమస్యలకు పరిష్కారం



కందుకూరు : నేదునూరులో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ గోపాల్

ఆదిభట్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతా యని ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్ శ్రీని వాస్ అన్నారు. మంగళవారం ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని రాందాస్‌పల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వ హించారు, ఆయన మాట్లాడుతూ రాందాస్‌పల్లిలో చాలా వరకు భూ సమస్యలు ఉన్నాయని తెలి పారు. రైతుల నుంచి 119 దరఖాస్తులు స్వీకరించి నట్లు చెప్పారు. సర్వే నంబర్ 41లో దాదాపు 300 మంది రైతులకు చెందిన భూములు నిషేధిత జాబితాలో నమోదై ఉన్నాయని, సమస్యను పరి ష్కరించాలని కోరుతూ డీటీకి వినతిపత్రం అంద జేశారు. ఈవిషయంపై గతంలో ఎమ్మార్వో, ఆర్డీ వో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య నెరవేరలే దని పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా, కాంగ్రెస్ నాయకులు వడాల రాజు, ఆర్ఐ సువర్ణ, విష్ణు, ఇబ్రాం, సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు : మండలంలోని నేదునూరు(అక్బర్ జా), లేమూరు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. నేదునూరులో తహసీ ల్దార్ కె.గోపాల్ పాల్గొని మాట్లాడారు. అర్జీలను ఎప్పటికప్పుడు అన్‌లైన్ చేస్తూ.. సీసీఎల్ఏకు పంపుతున్నట్లు తెలిపారు. త్వరలో సమస్యల పరి ష్కారానికి కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా, నేడు(బుధవారం) అల్లిఖాన్‌పల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించనున్నట్లు తెలి పారు. అలాగే లేమూరులో డీటీ శేఖర్ రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఏఎంసీ డైరక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, పుష్పదర్శన్, మాజీ వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మూల హన్మం త్‌రెడ్డి, కె.రాణాప్రతాప్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, సత్యనారా యణరెడ్డి, బి.సురేష్, వి.బాబు, ఎగిరిశెట్టి న ర్సింహ, రాములు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



- ఆదిభట్ల : సమస్యలు పరిష్కరించాలని డీటీకి వినతిపత్రం ఇస్తున్న రైతులు



చేవెళ్ల : కేసారం సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణయ్య

చేవెళ్ల : రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.కృష్ణయ్య తెలిపారు. కేసారంలో సదస్సు నిర్వహించారు. మాజీ సర్పంచ్ కాసుల రమేశ్‌గౌడ్, రెవెన్యూ అధికా రులు, సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

అంచెలంచెలుగా హామీలు నెరవేరుస్తాం



శంషాబాద్ రూరల్ : తొండుపల్లిలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్/శంషాబాద్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇ చ్చిన హామీలన్నీ అంచెలంచెలుగా నెరవేరుస్తామ ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషా బాద్ మున్సిపల్ కేంద్రంలోని వివిధ బస్తీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళ వారం ఆయన శంకుస్థాప నలు చేశారు. అంతకుముందు అంబేడ్కర్ నగర్‌లో, కూరగా యల మార్కెట్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సుష్మా మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్.గణేష్‌గుప్తా, మాజీ కౌన్సిలర్లు ఆయిల్‌కు మార్, స్రవంతీ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు దూడల వెంకటేష్‌గౌడ్ మహేందర్‌రెడ్డి, శ్రీను, మల్లారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలా 'రైతు భరోసా'

రైతు భరోసా పథకం పండుగ వాతావరణంలో అమలు జరుగుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని గొల్ల పల్లి మాజీ కౌన్సిలర్ చెన్నం అశోక్, కిషన్‌గూడ మాజీ కౌన్సిలర్ పారేపల్లి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పలు వార్డుల్లో సీసీ రోడ్లను ప్రారంభిం చారు. రైతులను రారాజు చేయాలనే ఆలోచనతో వేల కోట్లు రైతు భరోసా నిధులు విడుదల చేసి నట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి బాట పట్టాయని అన్నారు. కాలనీ వాసులు, అధికారులు, నాయకులున్నారు.

క్రైం కార్నర్

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

కడ్తాల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బైక్(గుర్తుతెలియని) ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కడ్తాల్ మండల కేంద్రం సమీపం లోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై సోమవారం జరి గింది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. వరంగల్ జిల్లాకు చెందిన వడ్డెపల్లి ఉమ, ఆమె భర్త శ్రీనివాస్ 15 రోజుల క్రితం కడ్తాల్ సమీపంలోని వికాస్ ఫాంహౌస్‌లో పని చేసేందుకు వచ్చారు. ఈక్రమం లో సోమవారం రాత్రి కూరగాయలు తీసుకువచ్చేందుకు భార్యాభర్తలు కడ్తాల్‌కు వచ్చారు. తిరిగి ఫాంహౌస్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా రాఘవేంద్ర హోటల్ సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని బైకర్ శ్రీనివాస్‌ను ఢీకొట్టాడు. ఘటనలో వడ్డె పల్లి శ్రీనివాస్ (54)కు తీవ్రగాయాలు కాగా కల్వకుర్తి ప్రభుత్వాసుప త్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బతుకుదెరువు కోసం వచ్చిన శ్రీనివాస్ మృతిచెందటం పలువురి మనస్సుని కలచివేసింది.

వ్యక్తి అదృశ్యం

ఆర్థిక ఇబ్బందులే కారణం!



శివ గౌడ్(ఫైల్)

కేశంపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు అదృశ్యమైన ఘటన కేశంపేట మండలం కొత్తపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మామిడి శివ గౌడ్(32) 15 ఏ ళ్లుగా ఓ మీడియా సంస్థ(ఎలక్ట్రానిక్)లో రిపోర్టర్‌గా పనిచేస్తు న్నాడు. కొంత కాలంగా ఆయన కుటుంబంలో ఆస్తుల గొడవలు జరుగుతున్నాయి. దాంతో పాటు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మంగ ళవారం తెల్లవారుజామున తన వాట్సాప్ స్టేటస్‌లో ఇన్ని రోజులు సహకరించిన శ్రేయోభిలాషులకు, అమ్మానాన్నలకు ధన్యవాదాలు.. నా అభివృద్ధిలో అన్ని రకాలుగా సహకరించిన ప్రతాపన్న(మాజీ ఎమ్మెల్యే)కు ప్రత్యేక ధన్యవాదాలు అని ఓ వీడియోను పోస్ట్ చేశాడు. గమనించిన శివగౌడ్ తల్లి అనసూయ పోలసులకు ఫిర్యాదు చేసింది. శివగౌడ్ ఫోన్ లాస్ట్ లోకేషన్ వరంగల్‌లో ఉన్నట్లు చూపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కటుంబ సభ్యులతో పాటు పోలీసులు వరంగల్ తరలివెళ్లారని సీఐ నరహరి తెలిపారు. శివగౌడ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఇంట్లోంచి వెళ్లే సమయంలో నలుపు రంగు ప్యాంటు, తెలుపు రంగు షర్టు ధరించాడని, తెలుపు రంగులో ఉంటా డని, 5.6 ఎత్తు ఉంటాడని తెలిపారు. ఆచూకీ తెలిస్తే కేశంపేట సీఐ 9440904759 నెంబర్‌కు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చేవెళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదె మృతిచెం దిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్‌పరిధి ముడిమ్యాల్‌లో చోటుచేసు కుంది. బాధిత రైతు కథనం మేరకు.. ముడిమ్యాల్‌కు చెందిన జూ కంటి బుచ్చయ్య గేదె పొలం వద్ద మంగళవారం మేత మేస్తోం ది. ఈక్రమంలో వేలాడుతున్న విద్యుత్ వైర్ తగిలి గేదె అక్కడిక్కడే మృ తిచెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని, పరిహారం అందించాలని రైతు బుచ్చయ్య కోరాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కల్లు కాదు.. కాలకూట విషం!

(ఐదో పేజీ తరువాయి)

పులియబెట్టిన నూకలు, యూరియా, కుంకుడు కాయలు వాడి తయారు చేసే రోజు నుంచి నేడు కల్తీ కల్లు తయారీ కోసం క్లోరో హైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్, సాక్రిన్ లాంటి నిషేధిత మత్తు పదార్థాలు వాడి కల్లు తయారు చేస్తున్నారు. అయితే, ఇవి మోతా దుకు మించి వాడితే మానవుని నాడీ వ్యవ స్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశ ముంటుంది. ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్లు నిషే ధించినా కల్లు విక్రయించేందుకు ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలను వినియోగిస్తున్నారు. అధికా రులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తు న్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లైసెన్స్‌లు తక్కువ.. విక్రయాలెక్కువ

కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలంలో కల్తీ కల్లు జోరుగా కొనసాగుతుంది. ఆయా గ్రామాల్లో లెసెన్స్ లేకున్నా తయారు చేస్తు న్నారు. కల్లు తయారీపై ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడం లేదు. కొన్ని శివారు గ్రామాల్లో కల్లు తయారు చేస్తూ వివిధ గ్రామాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటు న్నారు. ఉమ్మడి మండలంలో 46 గ్రామాలతో పాటు అనుబంధ గ్రామాల్లో సైతం ఆటోలలో తరలిస్తూ విక్రయిస్తున్నారు. ప్రతి గ్రామానికి లైసెన్స్ ఉన్నప్పటికీ ఈత చెట్లు మాత్రం రెండు మూడు గ్రామాల్లోనే ఉన్నాయి. దీంతో కల్తీ కల్లు క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. ఎక్సైజ్ పోలీసులకు మాత్రం చిన్న దుకాణానికి నెలసరిగా రూ.2 వేలు, పెద్ద దుకాణంకు ఐదు వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరో పణలు ఉన్నాయి. కొందుర్గు, జిల్లేడు చౌదరి గూడ మండలంలో ఏనాడూ దాడులు చేయక పోవడం చూస్తుంటే ఆరోపణలకు ఆజ్యం పోసి నట్లు అవుతోందని తెలుస్తోంది.

కల్తీ కల్లును నివారించాలి



స్వచ్ఛమైన కల్లు ఈదుల్లో లీటరు రూ.100 కు విక్రయిస్తుంటే కల్తీ కల్లు డిపోలలో రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. కల్లు సర్వరోగ నివారిణి అనేది పోయి అన్ని రోగాలకు కల్లు కారణం అన్నట్లు ఉంది. కల్తీ కల్లు తయారు చేసి సామా న్యుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

- పోతురాజు జంగమ్మ, చిన్న ఉమ్మెంత్యాల, కొందుర్గు మండలం

ఐదేళ్లలోపు పిల్లలను 'అంగన్‌వాడీ'లకు పంపాలి



చేవెళ్ల : అక్షరాభ్యాసం చేయిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి



మహేశ్వరం : రావిరాల కేంద్రంలో అక్షర్యాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ

ఇబ్రహీంపట్నం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలను ఖచ్చితంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఇబ్రహీంపట్నం సీడీపీవో కె.వినీతాదేవి తల్లిదం డ్రులకు సూచించారు. అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్ర మంలో భాగంగా మంగళవారం మండల పరిధి తులేకలాన్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరా భ్యాసం చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పల్లవి, కార్య దర్శి మల్లేషం, టీచర్లు పాల్గొన్నారు.

మహేశ్వరం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు చిన్నప్ప టినుంచే సామాజిక, భాషాభివృద్ధితో పాటు మేధోవికాసం పెరుగుతుందని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాలలో సామా జిక అక్షరాభ్యాసం, అమ్మమాట-అంగ న్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిం చారు. ప్రాథమిక విద్య వల్ల కలిగే లాభాలను వివరించారు. పలువురు వృద్ధ మహిళలను సన్మానించారు.

కేశంపేట : 3 నించి 5సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కేశంపేట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ దివ్య సింగ్ సూచించారు. కొండారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ బాల్యసంరక్షణ విద్యా(ఈసీసీఈ) కార్యక్రమాన్ని నిర్వ హించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, మాజీ సర్పంచ్ రాజు, కార్యదర్శి స్వరూప్ కుమార్, టీచర్ ఈశ్వర్‌బాయి పాల్గొన్నారు.



కేశంపేట : విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ దివ్యాసింగ్

ఆమనగల్లు : రెండేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదు చేయించాలని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ తల్లిదండ్రులను కోరారు. మంగళపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్ర మాన్ని నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ జి. అనిత, అంగ న్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేవెళ్ల : ప్రభుత్వ బడుల్లోనే విద్యా ర్థులను చేర్పించాలని చేవెళ్ల పీఏ సీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి తెలిపారు. పట్టణ కేంద్రలోని అంగ న్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యస కార్యక్రమంలో చైర్మన్ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిం చారు. అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నా రులు తదితరులు ఉన్నారు.

యువ వికాసం.. మరింత జాప్యం!

(ఐదో పేజీ తరువాయి)

రూ. లక్ష వరకు 1,360 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2,472 మంది లబ్ధిదారులకు రుణం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 1,088 మందిని ఎంపిక చేశారు. వీరందరికి జూన్ 2 నుంచి రుణ పత్రాలు పంపిణీ చేయాలని నిర్ణయించినా చివరి నిమిషంలో అది వాయిదా పడింది.

సిబిల్ స్కోర్ ఉంటేనే రూ.లక్షపై రుణం

యువ వికాసంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా అధికా రులే చేస్తారని నిబంధనల్లో రూపొందించారు. తీరా తుది జాబితా ఎంపికలో అధికార పార్టీ నాయులు సూచించిన వారికే ప్రాధాన్యత లభించిందన్న ఆరోపణలున్నాయి. ఇదివరకే రుణం తీసుకున్న లబ్ధి దారుల సిబిల్ స్కోర్‌ను రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ఆధారంగా తీసుకుంటున్నారు. సిబిల్ స్కోర్ అవసరం లేదని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించిన ప్రయోజనం లేకుండా పోయింది. ఆయా విభాగాల వారీగా మండల కమిటీలు లబ్ధిదారు లను గుర్తించినా అధికారులు అర్హుల జాబితాను బయట పెట్టడం లేదు. దీని వల్ల లబ్ధిదారుల్లో నైరాశ్యం నెలకొంది.

అయోమయంలో యువత..

రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు జూన్ 2వ తేదీనా మంజూరు పత్రాలు అందజేస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. అయితే.. ఊహించని అడ్డంకులు, క్షేత్రస్థాయి సమస్యల కారణంగా ఈ పంపిణీ ప్రక్రియ వాయిదా పడింది. ఈ ఆలస్యం పథకం కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది దరఖాస్తు దారుల్లో అయోమయాన్ని, భవిష్యత్తుపై ఆందోళనను రేకెత్తించింది. జూన్ 2న జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలో ఈ పథకం అమలు తీరుపై విస్తృతంగా చర్చ జరిగినప్పటికీ.. ఇప్పటివరకు దీనిపై స్పష్టమైన నిర్ణయం వెలువడలేదు. ఇది యువత ఆశలను మరింత సన్నగిల్లజేస్తోంది.

రుణం కోసం ఎదురు చూస్తున్నా



డెయిరీ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకు న్నాను. రాజీవ్ యువ వికాసం కింద రూ. 4 లక్షలు రుణం ఇస్తే.. డెయిరీ ఫాం ఏర్పాటు చేసుకోవాలనుకున్నాను. రుణం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాను. ఇప్పట్లో రుణం వచ్చే అవకాశాలు కనిపించడం లేవు. ముందస్తుగా రూ.50 వేల నుంచి లక్ష వరకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణ యించింది. రూ.2 నుంచి 4 లక్షల రుణం ఇస్తదో, ఇవ్వదో తెలి యదు. అర్హులైన వారికి రుణం ఇస్తే బాగుంటుంది.

- నవీన్‌కుమార్, నిరుద్యోగి, జిల్లేడు చౌదరిగూడ

బుగ్గ రామేశ్వరాలయానికి నిధులివ్వండి



మహేందర్‌రెడ్డి కలిసిన కొమరబండ గ్రామస్థులు

షాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో కొలువుదీ రిన శ్రీ బుగ్గరామేశ్వర స్వామి ఆలయం శిథిలా వస్థకు చేరిందని, ఆలయ పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. కొమరబండ, రేగడిదోస్వాడ మధ్యలో వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని, వర్షాకాలంలో రైతులకు రాక పోకలకు ఇబ్బంది కలుగుతోం దని ఆలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డిని నగరంలో ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్‌చైర్మ న్ మాధవరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు చేవెళ్ల సుభాష్ చంద్రబోస్, నాయకులు నరహరి చారి, బర్ల యాదయ్య తదితరులున్నారు.

మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతాం

(ఐదో పేజీ తరువాయి)

వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, ఉప్పరి గూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, ఏడీఏ సుజాత, మార్కెటింగ్ శాఖ డీఈఈ కె.ర వీందర్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కార్యదర్శి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి వేగవం తంగా జరుగుతుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండల పరి ధిలో పర్యటించి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలు పంపిణీ చేశారు. చెన్నారెడ్డిగూడలో రూ.1.40 కోట్లతో సీసీ రోడ్డు పనులు ప్రారంభిం చారు. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 435 మంది లబ్ధిదారులకు ఇళ్లపత్రాలు, 53 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అంద జేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నేత విష్ణువర్ధన్‌రెడ్డి, జయమ్మ, వెదిరె హన్మంత్‌రెడ్డి, సాతిరి ఎల్లేష్, రమాకాంత్‌రెడ్డి, చీమల జంగయ్యయాదవ్, జెనిగె వెంకటేష్‌యాదవ్, ముచ్చర్ల వెంకటేష్ యాదవ్, ఎడమ నరేందర్‌రెడ్డి, కావలి శ్రీనివా స్, మార సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

తలకొండపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి సహాయనిధి పేదలకు వరంగా నిలుస్తుం దని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లికి చెందిన ముంతాజ్ బేగంకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీని వాస్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.15 వేలు మంజూరయ్యాయి. మంగళవారం గట్టిప్పలపల్లిలో బాధితురాలి భర్త చాంద్‌పాష కు చంద్రశేఖర్‌రెడ్డి చెక్కును అందజే శారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కోరారు. వైద్య చికిత్సలు పేదలకు భారం కాకుండా ప్రభుత్వం తోడ్పాటునందించాలన్నారు. మాజీ సర్పంచ్ జ యమ్మవెంకటయ్య, కృష్ణయ్య, రాజు, జంగయ్య, రవీందర్, అశోక్‌గౌడ్, విజయేందర్, కొండల్, మ ల్లేశ్, యాదయ్య, శరత్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి

ఆర్థిక సాయం

మాడ్గుల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకొండ గ్రామానికి చెందిన నాగి ళ్ళ లక్ష్మయ్య కొన్ని రోజుల నుంచి అనా రోగ్యం తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి తన వంతు సాయంగా రూ.10వేలు సమకూ ర్చాడు. ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ అఖిల్‌కు అంద జేశారు. మంగళవారం బాధితుడి కుటుంబా నికి అందించారు. అప్పారెడ్డిపల్లికి చెందిన దోనాల సాయులు ఇటీవల మరణించాడు. అయన కుటుంబానికి సానుభూతి తెలిపి మాజీ స ర్పంచ్ పద్మ యాదయ్యల ద్వారా రూ.3వేల ఆర్థిక సాయం అందించారు.

ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటించాలి

మహేశ్వరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్ర తతో పాటు పచ్చదనంపైనా ప్రతీఒక్కరు దృష్టి సారించాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధి లోని పలు వార్డుల్లో తడి, పొడిచెత్తపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై చెత్త వేసిన పలువు రుని గుర్తించి జరిమానా విధించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు ప్రతీ రోజు తడి, పొడిచెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికలో తుక్కుగూడ మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని, ప్రతీఒక్కరు సహకరించా లన్నారు. చెత్తాచెదారాన్ని రోడ్లపై వేస్తే జరిమానా విధిస్తామ న్నారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వాణి

పేదలకు అండగా కాంగ్రెస్

కడ్తాల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు, పేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, ఎవరు అధైర్య పడవద్దని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్ష లకనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం గూడూరు శ్రీని వాస్ రెడ్డి పర్యటించారు. పలు కాలనీలలో ప్రజల సమ స్యలు తెలుసుకొని పరిష్కారానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణ రెడ్డి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. ఇటీవల మృతి చెందిన శేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. బాధి త కుటుంబానికి మనోధైర్యం కల్పించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, గిరి జన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీ ఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు జహంగీర్‌అలీ, సత్యం యాదవ్, శంకర్, రామకృష్ణ, తదితరులున్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న డాక్టర్ దీప్తి తదితరులు

కొత్తూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డయోరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు దీప్తి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డయేరియాపై ప్రజలకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. వర్షకాలంలో డయేరియాకు గుర య్యే అవకాశం ఉన్నందున్న ప్రజలు వైద్యధికారుల సూచ నలు, సలహాలు పాటించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ ప్యాకె ట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సీహెచ్‌వో నాగేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు వితరణ



కంప్యూటర్లు అందజేస్తున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తూర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సిద్దాపూర్ ప్రాథమిక పాఠశాలకు బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధ న్‌రెడ్డి రెండు కంప్యూటర్లను అందజేసి ఉదారత చాటుకు న్నాడు. గ్రామ యువ నాయకుడు గన్నోజు శ్రీధర్‌చారి కోరిక మేరకు కంప్యూటర్లను అందజేశారు. విష్ణువర్ధన్‌రెడ్డికి టీచ ర్లు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఇంద్రాసేనారె డ్డి, నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్, హరికృష్ణచారి, సురేష్, కొండల్‌చారి, రవి, మెహన్ తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బుతో బోర్ వేయించిన ప్రతాప్‌రెడ్డి



చేవెళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తంగడ్ పల్లిలో కొన్ని రోజు లుగా నీటి సమస్య ఉండడంతో గ్రామస్థుల ఇబ్బందులను ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి గమనించాడు. సొంత డబ్బు రూ.2లక్షలతో ఇటీవల నూత నంగా బోరు వేయించాడు. మంగళవారం మోటర్ బిగించి ఆన్ చేశారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

కరాటేలో శిక్షణ.. బాలికలకు ప్రశంసాపత్రాలు

ఇబ్రహీంపట్నం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నాగన్‌ప ల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికా విద్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. 50 రోజులపాటు ఉచితంగా కరాటేలో శిక్షణ పొందిన బాలికలకు లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ కేవీ రమేష్ రాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రభుత్వం బాలికా విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఆయన తెలిపారు. బాలికలు స్వీయ రక్షణకోసం కరాటే వంటి సాధనలు నేర్చుకోవాల న్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.నందిత, కరాటే గ్రాండ్ మాస్టర్ మంకాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందజేసిన అనంతరం బాలికలతో రమేష్‌రాజు తదితరులు